# జీవన గతులు

(కథా సంపుటి)

చెన్నూరి సుదర్శన్



శోభ సాహితీ ప్రచురణలు

# జీవన గతులు

(కథా సంపుటి)

చెన్నూరి సుదర్శన్

© Writer

# Jeevana Gathulu

(Short Stories)

**CHENNURI SUDARSHAN**

First Edition : 2018

Cover page desined & Illustration : Chennuri Sudarshan

For copies :
Chennuri Sudarshan,
1-1-21/19, Plot No.5, Road No: 1, Sri Sai Lakshmi Shobha Nilayam, Ram Naresh Nagar, Hyder Nagar, Hyderabad-500 085
Cell: 9440558748/mail: sn.chennuri@gmail.com
అన్ని ప్రముఖ పుస్తకాల షాపులు

**Printed** : Anupama Printers,

Shanthi nagar, Hyderabad/040-23391364

వెల : రూ. 99/-

# కథాక్రమం


| | | |
|---|---|---|
| 1. | జీవన గతులు | 1 |
| 2. | లోలకులు | 11 |
| 3. | పరకామణి సేవ | 21 |
| 4. | కరుణ | 29 |
| 5. | అంతశయ్య | 38 |
| 6. | ఆభరణాలు | 46 |
| 7. | రుణం | 61 |
| 8. | ఏ.టి.ఎం. | 73 |
| 9. | మగబుద్ధి | 76 |
| 10. | ఊపిరి | 83 |
| 11. | తీరని బాకీ | 94 |
| 12. | తెలివి ఒక్కరి సొమ్మంటే..! | 106 |
| 13. | విజయకేతనం | 117 |
| 14. | పంతులు కందకం | 127 |
| 15. | శునకనీతి | 133 |
| 16. | భర్త @ భార్య | 144 |
| 17. | బాయ్‌ఫ్రెండ్ | 153 |
| 18. | శీలవతి | 159 |

# జీవన గతులు

జనరల్ ఎలక్షన్స్..

ప్రిసైడింగ్ ఆఫీసరుగా వరంగల్ జిల్లా ములుగు మండలంలోని జంగాలపల్లికి వెళ్లాల్సి వచ్చింది.

హన్మకొండ కలెక్టర్ కార్యాలయం నుండి మాబస్సు మధ్యాహ్నం రెండు గంటలకు బయలు దేరింది. ఆఊళ్ళో దిగేసరికి సాయంత్రం ఐద యింది.

జంగాలపల్లి చిన్న గ్రామం.

ప్రైమరీ స్కూల్లో విడిది చేశాం. ఫరవాలేదు.. వసతులున్నాయి. రెండు ట్యూబులైట్లతో బాటు రెండు ఫ్యాన్లు ఉండటం మాఅదృష్టమే. బడికి ఈశాన్య మూల బోరుబావి దాని పక్కనే వాటర్ ట్యాంకు.. ఆగ్నేయమూల మరుగుదొడ్లు. బడిప్రహరీ చుట్టూ పచ్చనిచెట్లు.. మధ్యమధ్యలో పూల మొక్క లు.. వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంది. జీవితాలు ధన్యమయ్యాయ నుకున్నాం. ఇలాంటి సౌకర్యాలు ఇంత మారుమూల బడిలో ఉండటం ఇక్కడి ప్రజలు పెట్టిపుట్టారు అనుకున్నాను. ఊళ్ళో సైతం సిమెంటు రోడ్లు.. రోడ్లకిరువైపులా చెట్లు హరిత హారంలా అలుముకొని శోభాయమానంగా ఉంది.

ఎలక్షన్ మెటీరియలంతా టేబుల్‌పై కుమ్మరించాను. అసిస్టెంట్స్ సహాయంతో రేపటి పోలింగ్ దృష్ట్యా నేడు పూర్తి చేసుకోవాల్సిన తతంగ మంతా చక, చకా ముగించుకొని ఫ్రెషప్ అయ్యేసరికి దాదాపు ఏడు కావ స్తోంది.

వేసవి కాలం మూలాన ఇంకా చీకటి పడలేదు..

ఆఊరి మస్కూరి వెంకటయ్య వేరుశనక్కాయ చెట్లు తెచ్చాడు. మధ్యాహ్నభోజనం తయారు చేసే వంటగది నుండి నిప్పులు.. కర్రముక్కలు తెచ్చి మంట రాజేసి వేరుశనక్కాయల చెట్లు కాల్చసాగాడు. వాని వ్రేళ్ళకున్న కాయలు మంటలలో రగులుకుంటూ నిప్పుల్లో రాలుతున్నాయి..

“సార్లూ.. నా సోపతుగాడు వంట సేయించేటాళ్ళకు మాలాసు టైమైతదిగాని రండ్రి.. ఇంతట్ల పల్లికాయ తిందురు” అంటూ మాసిబ్బందిని ఆహ్వానించాడు వెంకటయ్య. వేరు శనక్కాయలంటే నాకు మహా ప్రీతి. వాటిని చూడగానే నాప్రాణం లేచి వచ్చింది. ఉత్సాహంగా కాలుతున్న శనక్కాయల ముందు అందరం గుండ్రంగా కూర్చున్నాం. వేడి వేడి కాయలు

ఒక్కొక్కటి ఏరుకుంటూ.. ఒలిచి గింజలను ఊదుకుంటూ.. నోట్లో వేసుకో సాగాం. మహా రుచిగా వున్నాయి.

నెమ్మదిగా ఆఊళ్ళో ఎలక్షన్ ట్రెండ్ గూర్చి కదిలించాను.

"మాఊల్లె ఎలచ్చన్ల లొల్లి.. కొట్లాటలు గస్మంటియే ఏముండయ్ సార్. అంతా ఏక పచ్చమే. ఊరోల్లమంతా ఒక మాటకు కట్టుబడుంటం.. ఒక్కళ్ళకే వోటేత్తం" అన్నాడు వెంకటయ్య. నాకు చాలా ఆశ్చర్యమేసింది.

"అదేంటి.. ఒక్క పార్టీ అభ్యర్థికేనా..?" అంటూ ఆశ్చర్యంగా అడిగాను.

"ఔ సార్. ఇదంతా మాఊరి దేవత విజయమ్మ తెలివి..ఆసల్లని తల్లి మాఊరిని ఒక్క తాటి మీద నడిపిత్తాంది.. ఈఊరంతా బడి, గుడి లెక్క కనబడ్తాందంటే అమ్మ సేతిసలువే.. "

"ఆమె ఈ ఊరి సర్పంచా?"

"కాదు సార్"

"ఎంపిటీసీ మెంబరా?.. జడ్పీటీసీ మెంబరా?"

"ఆమెకసోంటి నౌకర్లు లేవు సార్. ఆమెకు వాటి మీద ఆస సుత లేదు. ఆమె కున్నదల్లా ఒక్కటే ఆస. మనదేసం మొత్తంమ్మీద మాఊరికి మంచి పేరు తేవాలని.. అందుకోసరం ఇప్పుడిప్పుడే పునాదు లేత్తాం ది"అంటూ వెంకటయ్య కొద్ది రోజుల క్రితం జరిగిన వృత్తాంతాన్ని కళ్లకు కట్టినట్లుగా చెప్పసాగాడు.

★★★

ఆరోజు జంగాలపల్లి పంచాయితీ కార్యాలయంలో గ్రామమహా సభ. గ్రామప్రజలు, ఎలక్షన్లలో పోటీ చేసే అభ్యర్థులంతా హాజరయ్యారు.

సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ సభనుద్దేశించి "మాగ్రామం లో విజయమ్మగారి మాట వేదవాక్కు. ఆమె నిర్దేశించే మార్గాన్నే మనమంతా నడుద్దాం" అని గ్రామ ప్రజలు చేసిన ప్రమాణాన్ని గుర్తు చేశాడు.

గ్రామాభివృద్ధి.. మంచి నీటిపథకాలు.. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, చెట్లు నాటడం.. తదితర అంశాల గురించి మాట్లాడాడు. ఆ ప్రాణాళికలకు అవసరమయ్యే డబ్బు.. తమ గ్రామానికి ప్రభుత్వం తరపున వచ్చిన గ్రాంట్లు.. ఖర్చులు మొదలగు వివరాలన్నీ ఏకరువు పెట్టాడు. విజ యమ్మ తన తరపున పంచాయితీ ఖజానాలో జమ చేసిన డబ్బు వివరా లిచ్చాడు. సభలో చప్పట్లు మ్రోగాయి.

మరి కొందరు పెద్దలు గ్రామాభివృద్ధికై పలు సూచనలు చేసారు.

# పరకామణి సేవ

పంచషష్టి వయసు మీరబోతోంది. ఏదైనా పుణ్య కార్యక్రమంలో పాల్గొనాలని నామనసు పదే, పదే ప్రాకులాడుతోంది. ఆ వయసుతో ముడిపడిన శ్రీవేంకటేశ్వర స్వామి వారి సేవలు గుర్తుకు వచ్చాయి. సర్వీసులో ఉండగా స్వామి వారిని దర్శించుకోవడమే తప్ప వారి సేవలు చేసుకునే అవకాశంకోసం ప్రయత్నించ వీలుకాలేదు.

పనుల ఒత్తిడి..

నేను పదవీ నిరమణ చేసినా.. పది మందికి జీవనోపాధి కల్పించాలనే సంకల్పంతో ఒక పరిశ్రమ స్థాపించాలనే ధ్యేయం అడ్డుపడింది.

చివరికి సాధించాను. అది కుటీర పరిశ్రమ.. 'ప్లాస్టిక్ సంచులు వాడకం రద్దు.. పేపర్ సంచులు ముద్దు' అనే నినాదంతో నడుస్తోంది. అందులో పేపర్లతో చేసంచులను తయ్యారు చెయ్యడం.. కంపెనీ డైరక్టర్ అయిన నా సతీమణి దమయంతి చూసుకుంటుంది.

నేను కాలేజీలో పాఠాలు చెప్పడమూ దైవ కార్యక్రమమే అని భావించే వాణ్ణి. తదనుగుణంగా పదవీ విరమణ అనంతరం బీద పిల్లలకు ఉచితంగా పాఠాలు చెప్పడమూ మానలేదు.

చతుర్విధ దానాలలో విద్యా దానం అత్యంత ప్రశస్తమైనదని నా ప్రగాఢ విశ్వాసం.

పదవీ విరమణ అనంతరం.. ఇలా క్షణం తీరిక లేకుండా.. పనిచెయ్యడం వెనుకాల పెద్ద కథ దాగి వుందనే చెప్పాలి. అలాంటి కథలు నేడు సర్వసాధారణమై పోయాయి.. ఇంటింటి రామాయణమే..

కొడుకులను కష్టపడి చదివించడం.. వారికిష్టమైన పెళ్లిళ్ళు జరిపించడం.. వారు నిర్దయులు.

మనకష్టాలను కాలదన్ని.. వారి ఇష్టాలకెగబాకి అమెరికాకెగిరి పోయేపిల్లల్లో నా ఒక్కగానొక్క కొడుకేమీ అతీతుడెమీ కాదు. వాడు ఎప్పుడొస్తాడో తెలియదు.. కనీసం మాకు తలగొరివి పెట్ట వస్తాడన్న నమ్మకమూ లేదు. వాని దయ.. మాప్రాప్తం. తలుచుకుని ఫాయిదాలేదు.. ఆ సర్వంతర్యామిని తలుచుకున్నా ఫలితముంటుందనే మార్గం.. స్వామివారి సేవ చెయ్యాలనే కోరికకు కారణమయ్యింది.

కాని స్వామి వారి సేవకు వయసుకు లంకె వుంది.

లడ్డూ ప్రసాద సేవ.. పరకామణి సేవలో తరించాలంటే అరవై ఐదు సంవత్సరాలు మించితే అనుమతిలేదు. పైగా రెండు సేవలకు మధ్య కనీసం మూడు మాసాల వ్యత్యాసముండాలానే నియమమూ వుంది..

కాలాతీతంగాకుండా స్వామి వారి పరకామణి సేవకు అంతర్జాలం ద్వారా దరఖాస్తు చేసు కున్నాను. స్వామి వారి కృపకు పాత్రుడనయ్యాను కాబోలు.. శ్రీవారి సేవకు అనుమతి లభించింది. నాసంతోషానికి అవధులు లేవు.

పరకామణి హాల్లో డబ్బులు.. ముడుపులు వేరు చేసే కార్యక్రమంలో భక్తులు తమ హృదయాలలోని ఆవేదనలు.. వానిని పరిష్కరించుమని స్వామివారికి సమర్పించుకునే వేడుకోలు ఉత్తరాలు చూసి గుండె బరువెక్కేది.. కళ్ళు చెమర్చేవి.

అలాంటి ఉత్తరాలలో.. ఒక ఉత్తరం నా కంట కన్నీరు తెప్పించింది. దాని సారాంశం..

'శ్రీవెంకటేశ్వరస్వామీ.. మా అక్కయ్యకు త్వరగా ఉద్యోగం దొరికేలా.. నా వివాహం అయ్యేలా చూడు స్వామీ.. సదానందం – నల్గొండ' అని సెల్ ఫోన్ నంబరు రాసి వుంది.

నాకు ఆశ్చర్యమేసింది..మదిలో ఆలోచనలు చెలరేగాయి.

'అక్కయ్యకు ఉద్యోగామేనా..! ఆమె వివాహం సంగతి?. ఆమెకు వివాహం గాకుండా చిన్నవాడైన అతడికి పెళ్లి కావాలని కోరుకోవడమేమిటి?. ఒక వేళ ఆమె వివాహితురాలైతే.. ఆమె భర్త ఉద్యోగం చెయ్యడం లేదా.. ఆమెకెందుకుద్యోగం? అతడికి ఉద్యోగం వద్దా..?' ఇలా పరి పరి విధాల నా మనసు ఆలోచించసాగింది.

అతడి వివరాలన్నీ నాకింకా గుర్తున్నాయి.

★★★

అదే రాత్రి ఫోన్ చేసాను. అతడు ఫోన్ ఎత్తాడు..

"హలో.. సదానందంగారేనా మాట్లాడేది" అడిగాను.

"హలో సార్.. సదానందంనే మాట్లాడుతున్నా.. మీరెవరు సార్.." అతడి గొంతు సౌమ్యంగా వినిపించింది.

నాకు కాస్తా ధైర్యం వచ్చింది. విషయం అడుగొచ్చు అని నిర్ధారించుకున్నాను.

"సదానందంగారు.. నా పేరు దయాకర్. నేను తిరుపతి నుండి మాట్లాడుతున్నాను"

# అంతశయ్య

**నాకు** కాస్తా మెళకువ వచ్చే సరికి కారు వెనుక సీట్లో పడుకున్నట్లు లీలగా గోచరించింది. కారు నడిపేది మా బాబు సవ్యసాచి అని గుర్తించ డానికి నాశక్తినంతా కూడగట్టుకోవాల్సి వచ్చింది. కాళ్ళు, చేతులు నా ఆధీనంలో లేవు. తల సైతం కదల్చడం కష్టమవుతోంది..

"ఏమైంది నాకు.. ఎక్కడికి వెళ్తున్నాం.." అని అడుగబోయాను. నోరు ఒక ప్రక్కకు తిరిగి పోతోంది.. మాట రావటం లేదు.

ఒక్క సారిగా కంపించి పోయాను.

అవాళ ఉదయం యథాక్రమంగా నిద్ర లేచాను.. కాల కృత్యాలు తీర్చుకున్నాను.. బ్రష్ చేసుకున్నాను.. కోడలు టీ పాయ్ మీద పెట్టి వెళ్ళిన కాఫీ సేవించాను.. ఆ తరువాత.. ఆతరువాత.. గుర్తుకు రావటం లేదు..

లిప్త కాలం నా కన్నులు యాదృచ్చికంగా మూసుకు పోయాయి.

ఆ తరువాత.. ఆ!..ఆ..! గుర్తుకు వచ్చింది. షేవ్ చేసుకుందామని గోడకు చిన్న అద్దం తగిలించాను.. బ్రష్‌తో సబ్బు నురగ రాసుకున్నాను. కుడి ప్రక్క బ్లేడ్‌తో షేవ్ చేసాను. ఎడమ ప్రక్క చేసుకోబోయాను.. చేయి కదల లేదు.. నడుం పట్టేసింది.. కళ్ళల్లో చీకట్లు కమ్ముకుంటూ తల ఒక వంక వాలి పోతోంది..

"బాబు సవ్యా.." అని అరిచినట్లున్నాను..

ఆ తరువాత.. బహుశః పడిపోయి వుంటాను.

సవ్య భయపడి పోయి వుంటాడు. పాపం..! కొత్త కోడలు.. ఎంత హడలి పోయి వుంటుందో..! హాయిగా ప్రాణం పోయినా బాగుండు.. నా పీడ విరగడ అయ్యేది.

కాని నా సవ్య అలా అనుకోవటం లేదనిపిస్తోంది.

స్ట్రోక్  వచ్చి నేను పడి పోయిన వెంటనే స్పందించి నలుగురిని పిలిచి నన్ను కార్లో పడుకోబట్టి వుంటాడు. అశ్రద్ధ చేయకుండా ఇప్పుడు హాస్పిటల్‌కు తీసుకెళ్తున్నాడు..

ఇలాంటి రోగాలకు కేరళ వైద్యం బాగా పని చేస్తుంది.. కాని వాడికి ఎలా చెప్పేది. హన్మకొండ అలంకార్ టాకీసుకెదురుగా ఒక బ్రాంచి వుంది. నన్ను అక్కడికి తీసుకెళ్తే బాగుండును.

ప్రకృతి చికిత్సాలయం హంటర్ రోడ్డులో వుంది. అక్కడి డాక్టర్ చిలువేరు క్రిష్ణమూర్తి నాకు స్నేహితుడు. అతడి వద్దకు తీసుకెళ్తే మరీ

మంచిది..

ఈ విషయం రాసి చూపిద్దామని మనసుకు తట్టగానే చేతి వేళ్ళను కదిలించే ప్రయత్నం చేసాను. వేళ్ళు వణికి పోతున్నాయి.. ఇంకా కలం పట్టుకునే శక్తి కూడానా.. ?

పోనీలే.. సవ్య నన్ను కార్లో తీసుకెళ్ళడమే గొప్ప.. ఏ హాస్పిటల్ అయితేనేం.. నేను తొందరగా కోలుకోవాలని వాడికి మాత్రం వుండదూ..!

ఎందుకు వుండదు..? నేను వాడికేమైనా తక్కువ చేసానా..? బాల్యంలో వాని పరిస్థితీ ఇదేగా..

అమ్మో..! ఆవిషయం జ్ఞప్తికి వస్తే నా గుండె ఆగిపోతుంది..

నామనసు గతం లోకి లాక్కెళ్ళుతోంది..

దాదాపు పాతిక సంవత్సరాల క్రితం..

★★★

పాతిక సంవత్సరాల క్రితం నేను వరంగల్లో పోచంమైదానం దగ్గర ఒక ప్రైవేటు జూనియర్ కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా పనిచేసేవాడిని.

మండీ బజారులో మకాం.

సవ్యసాచికి అప్పుడు వయసు మూడేండ్లు. వాని తరువాత నేను మళ్ళీ తండ్రినయ్యే భాగ్యానికి నోచుకోలేదు. నా టూవీలర్ ప్రమాదం మూలాన నా సహచరి సంధ్యారాణి గర్భసంచి తొలగించుకోవాల్సి వచ్చింది.

అవాళ ఉదయం ఆరు గంటలకు కొళాయి వస్తూంది. సంధ్య మంచంలో పడుకుని విశ్రాంతి తీసుకుంటూంది..

నేను వీధి గుమ్మం ముందున్న కొళాయి నుండి నీళ్ళు తేవడానికి బిందె తీసుకుని బయలు దేరాను. సవ్య చిన్న చెంబు తీసుకుని నా వెనకాలే రాసాగాడు.

వాడికి మూడు రోజుల నుండి జ్వరం వస్తూంది. వద్దని చెబితే మారాం చేయసాగాడు.

“పోనిద్దూ..! ” అంటూ సంధ్య వాడికి వత్తాసు పలికింది.

వాని ముఖంలో వేయి దీపాలు వెలిగాయి. కిల కిలా నవ్వుతూ గడప దాటబోయి పడిపోయాడు.

“చెబితే విన్నావా..?” అంటూ చిరుకోపం ప్రదర్శిస్తూ లేపబోయాను. వాడికి నిలబడటం చేత కావటం లేదు. కాళ్ళు నిస్సత్తువగా వాలి పోతున్నాయి.

“కాళ్ళు నొప్పి.. ” అంటూ ఏడ్వసాగాడు.

# ఋణం

**పోచయ్య** ఎడ్ల కొట్టంల భీముడు బెంగటిల్లి 'ఘ్రువ్వా..'' అన్కుంట తల్కాయె ఎత్తి ఏడ్వబట్టింది. దాని కండ్లల్ల కెల్లి నీళ్లు కారిన సారలు ఎండుకపోయి అట్టుగట్టినై. తలకాయె ఇసురుకుంట మల్ల మల్ల సరాయించ బట్టింది.

గంజి కాసుకుంటనని పోచయ్య పొయ్యి మీద దొరింపుచేసుకున్న అటికె, సుక్కలు సుక్కలు కారబట్టింది. అటికె పొక్క పోతె తన పెండ్లాం పాపమ్మ పాత చీరె అంచు చీరి నల్చి కుచ్చిండు. పిడుక కున్నెల మీద తాప తాపకు గంజి సుక్కలు పడ్తాంటె సుయ్యి, సుయ్యిమనబట్టింది.. పొయ్యి ఓమానంగ మండకచ్చింది. ఊదీ, ఉదీ కడుపుల పేగులు ఉండలు సుట్టుకపోయి నోట్లెకు రాబట్టినై. మీదికెల్లి భీముని ఏడ్పోటి.. పానమంత బిగబట్టుకొని లేచి నిల్సుండె టాల్లకు రంగుల రాట్నం లెక్క తల్కాయె గిర్రున తిర్గినట్లె సొలిగిండు. గుడిసె నిట్టాడుకు నిలబడి కొంచెం సుజరాయించు కున్నడు. ఇంటెన్కకు పోయి గూటానికి కట్టేసిన భీమున్ని సూడంగనే పోచయ్య పానం అవిసి పోయింది. ముందట గోళెంల కల్పి పెట్టిన కుడుతి కల్పినట్లే ఉన్నది. మూతి పెడ్తే ఒట్టు. సొప్పకట్టెలైతె అర్కీస్ ముట్టుకోలె. ఉర్కుంట పోయి భీముని ముందటి  రెండు కాళ్ళు పట్టుకున్నడు పోచయ్య. కట్ట తెగి కుంట్ల నీల్లు మంట్లె పారినట్టు పోచయ్య కండ్లల్ల కెల్లి నీల్లు ఏరులై కారబట్టినై. పొయ్యి మీది అటికెలకెల్లి నీల్లు కారి పొయ్యిల పడ్డట్లే, భీముని కంట్లెకెల్లి కారే కండ్ల నీల్లు పోచయ్య పెయ్యి మీద పడబట్టినై.. సుక్కలు.. సుక్కలు.  పోచయ్య కడ్పుల యాతన తుక తుక ఉడ్కుతాంటే పెయ్యి మీద పడ్డ సుక్కల్లకెల్లి పొగలు రాబట్టినై. ఎవరికైనా చెప్పుకుంటే మనుసు జరంత నిమ్మళమైతదనుకుంటే పోచయ్యకెవలున్నరు?.. పెద్ద దిక్కు భీముడు తప్ప. తనకు తెల్వకుంటనే.. పట్టిన కాళ్ళు విడువకుండనే దానికే తన యాతనంత చెప్పబట్టిండు.

"నీ సోపతికాడు రాముడు లేడని ఏడ్తానవా భీముడా.. సొప్ప ముట్టక పోతివి.. కుడ్తి ముట్టక పోతివి.. గిట్లైతె ఎట్లరా.. నేనేం చేత్తురా.. నా కర్మ గిట్ల పాడైంది.. ఈడు మీద పడక ముందే నా ఇంటిదానికి మాయదారి రోగమచ్చె .. ఒక్క పోరన్నే కని కాటికి కాల్లు సాపె.. గరీబోల్ల దవకాన్లకు తీసుక పోతె ఈడ గాదు.. కానీకు దవాకాన్ల షరీకు చెయ్యిమనిరి.  ఆ పరీచ్చలు.. ఈ పరీచ్చలు అన్కుంట చేతుల పైసలు సాపు చేసిండ్లు.. పొతే

పోయినై నా చేతి మైల అనుకున్న కాని రోగమేందో బైట పెట్టక పోయిరి డాక్సర్లు. పెద్ద దవాఖాన్లకు పోండ్లని పట్నం పంపిచ్చిరి. మల్ల మల్ల పరీచ్చలు.. పరీచ్చలు.. పరీచ్చలు.. రోగం మిక్కుటానికి వచ్చినంక వత్తవా అని మీదికెల్లి గద్రిచ్చి పెట్టిరి.. కాని ఫలాన రోగమని తేల్సి చెప్పక పోయిరి. ఇండ్ల నా తప్పేమున్నది చెప్పు భీముడా.. ఇంటిదాని ఒంట్లె జరంత జరం రాంగనే దవఖానకు తీస్కపోతినా.. గన్ని పరీచ్చలు చేసినా సుత రోగమేందో తెల్సుకోకపోతె నాతప్పా?.. గట్టిగ అడుగుదామంటే పాపమ్మ పానాలు వాల్ల చేతుల్ల ఉన్నయని పానమంత పింజం పింజం కాబట్టింది.. ఓపిక పట్టిన.. మందుల కంటె డాక్సర్ల పీసులే తడిసి మోపడాయె.. ఉన్న రెండెకరాలు ఊడ్సుక పాయె.. రోగం తగ్గక పాయె.. " అంటాంటే పోచయ్య సరం దగ్గర పడ్డది. నోట్లెకెల్లి సొల్లు కారబట్టింది.. తల్కాయె ఓర చేసి భుజంమ్మీదున్న కండువకు తుడ్సుకున్నడు కాని భీముని కాల్లు ఇడ్వలే.. ముట్టుకుంటే మాసి పోయే మనిసి.. నల్లట్టెక పడి తలెంటుకలన్ని ఊసిపోయి బొక్కల గూడు లెక్క మంచానికి అతుక్కొని పానమిడ్సిన పాపమ్మ కండ్లల్ల మెదిలెటాల్లకు నీల్లు సుళ్లు తిర్గినై.

పోచయ్య కొడుకు తలె చేతుల పట్టుకొని గల్మల్ల నిలబడి బీర్పోయి సూత్తాండు.. పోచయ్య పానం ధస్సుమన్నది.

"పోరడు చేతికందక ముందే నా బతుకు ఆగం చేసి పాయె.. పిడాత పానం పోయే దాక చెప్పక పోయిరి డాక్సర్లు.. దిక్కు లేని పచ్చి లెక్క ఒర్రిన.. గప్పుడు నోరు తెర్సిండ్లు.. 'గాలి తిత్తుల్ల కాన్సరైంది.. కాన్సరంటే పానం కాన్సిలే.. మా సేతుల్ల ఏమున్నది మేమేమైన దేవుల్లమా..?' అన్నరు. గట్లైతే పరీచ్చలు.. పరీచ్చలు అన్కుంట పీతిరి గద్దల్లెక్క గీ పీక్క తినుడెందుకో అనిపిచ్చింది నామన్సుకు.. మొత్తం పైసలు కట్టందే పీనుగను తాకనియ్యక పోయిరి.. ఏం చెయ్యాలె.. నువ్వే చెప్పు భీముడా.. చేతుల చిల్లి గవ్వైనా లేక పాయె.. నీ సోపతుగాడే నాకు దారి సూపిండు.. పాపమ్మను దానం చెయ్యాలంటే రామున్ని అమ్మక తప్పలే.. భీము .. మన గోస దేవుడు సూత్తాండంటవా.. నువ్వైనా చెప్పు.." అన్కుంట ఏడ్వబట్టిండు పోచయ్య. పాపం..! ఎద్దు ఏం చేప్తది.. బుద్ధున్న మనుషులే ఎన్ను(వీపు) సూపియ్య బట్టిరి.

"నాయ్నా.. ఆకలైతాంది.. బువ్వెయ్యే.." అన్కుంట వచ్చిండు పోచయ్య కొడుకు కూషాలు.

కూషాలు.. పోచయ్య తాత పేరు. కొడుకు తన తాత లెక్క

# ఊపిరి

అవ్వాళ ఐతారం(ఆదివారం).

నేలమాళిగలో(సెల్లార్లో) ఉదయం పది గంటలకు పది మంది పిల్లలకు ట్యూషన్‌లో మునిగి పోయి ఉన్నాడు బుచ్చిమల్లు. అతడికి వారాలతో గాని సెలవు దినాలతో గాని పని లేదు. అలా ట్యూషన్ చెప్తుంటేనే అతడి బతుకు బండి సాగేది.

"తాతా..!" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది బుచ్చిమల్లు మనుమరాలు సుమేధ.. ముద్దుగా ఇంట్లో అందరూ పిల్చుకునే సుమీ.

బుచ్చిమల్లు గుండె గుభేలుమంది. గభాల్న వీధిగుమ్మం మూసేద్దామంటే సుమీ రెండు కాళ్ళనూ చుట్టేసుకుని వుంది. అతడి ఒంట్లో వణుకు పుట్టింది. వెనకాల అతడి కొడుకు గాని కోడలు గాని వస్తున్నారేమోనని కలవర పడ్డాడు. కళ్ళజోడు సవరించుకుంటూ ఎవరూ రావడం లేదని నిర్ధారణ కాగానే అమాంతం సుమేధను హృదయానికి హత్తుకున్నాడు. పోయే ప్రాణం లేచి వచ్చినట్లయ్యింది.

'ఎన్నాళ్ళైంది..? ఈ స్పర్శకు నోచుకోక.. ఇలాగే ఊపిరి ఆగిపోతుందనుకున్నాను' అన్నట్లుగా.. బుచ్చిమల్లు మనసు తల్లడిల్ల సాగింది. ధుఃఖం పెల్లుబికింది. ఘొల్లుమన్నాడు.. సుమేధ సైతం  బిగ్గరగా ఏడ్చేసింది.

ట్యూషన్‌కు వచ్చిన పిల్లలంతా బిక్కు బిక్కు మంటూ వారి వంక చూడ సాగారు. బుచ్చిమల్లు తల 'ఈ పూటకిక సెలవు' అన్నట్లుగా స్పందించడం.. గమనించి పిల్లలు ఒకరి తరువాత మరొకరు పుస్తకాలు సర్దుకొని వెళ్ళిపోయారు.

కాసేపటికి తమాయించుకున్నాడు బుచ్చిమల్లు. సుమేధ బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించాడు. ఉప్పదనమైన తన పెదవులను తడుముకుంటూ తన్మయత్నం చెందసాగాడు.

బుచ్చిమల్లు ఆనంద భాష్పాలను సుమేధ తన చిట్టి చేతులతో తుడువ సాగంది. కన్నీరు తెరలు తెరలుగా ఉప్పొంగ సాగాయి.. గుండె దిటవు చేసుకున్నాడు.

అవ్వాళ్టి సంగతి జ్ఞప్తికి రాగానే అతడి చేతులు అప్రయత్నంగా సుమేధను దూరంగా తోసేశాయి.

"నేనంటే ఇట్టం లేదన్నావ్.. మల్ల ఎందుకచ్చినవ్..? మీ అవ్వ నాయన దగ్గరికే పో.." అంటూ చిరు కోపం ప్రదర్శించాడు. బుచ్చిమల్లు భుజామీమ్మది కండువాతో కళ్ళు తుడ్చుకుంటూ.. అలాగే వాలు కుర్చీలో వాలి పోయాడు.

సుమేధ దూకుడుగా అడుగు ముందుకు వేసి వచ్చి కుర్చీ ఎక్కి బుచ్చిమల్లు తొడలమీద కూర్చుండి పోయింది. తన తాత నడుమును గట్టిగా పట్టుకొని ఎదపై తల ఆన్సింది. సుమేధ వీపును తన రెండు చేతులతో సుతారముగా నిమురసాగాడు బుచ్చిమల్లు. తెంచుకుంటే తెగిపోయే బంధం కాదది.

బుచ్చిమల్లుకు ఆనాటి దృశ్యం కళ్ళకు కట్టినట్లు సాదృశ్యంగా కనబడుతోంది.. మనసు దహించి వేస్తోంది.

★★★

"నాయ్నా.. అయ్యగార్ని అడిగత్తాన. వచ్చే నెల ఆరో తారీఖున మంచి మూర్తం వుందట.. కొత్త ఫ్లాట్లకు పోదాం.." పెద్ద దర్వాజలో అడుగు పెట్టుకుంటూ అన్నాడు బుచ్చిమల్లు ఏకైక సంతానం సదానందం.

బుచ్చిమల్లు హృదయం పులకించి పోయింది.. సొంత గూటిలో పొదిగిన విహంగమయ్యాడు.

'ఎంత కాలానికి తన కోరిక తీరబోతోంది..!' అన్నట్లుగా పొంగిపోయాడు. కళ్ళు మూసుకొని ఆ పరమాత్మునికి నమస్కారాలు సమర్పించుకోసాగాడు.

ఇంతలో వంటింట్లో నుండి సదానందం భార్య కళావతి సంకేతాలు అందినట్లున్నాయి.. వ్యక్తపరుస్తున్న తండ్రి సంతోషాన్ని తోసిరాజని సదానందం అంతర్ధానమయ్యాడు. 'గీ కాలపు పొలగాండ్ల తీరే గంత' అని మనసు నెమ్మదించుకున్నాడు బుచ్చిమల్లు.

"తాతా.. అన్న కొడ్తాండు.." అంటూ సుమేధ పరుగెత్తుకుంటూ వచ్చి బుంగమూతి పెట్టింది.

"తాతా.. అన్ని అబద్ధాలు చెప్తాంది.. సుమే నన్ను కొట్టి ఉర్కత్తాంది.." అంటూ కింది పెదవి పంటి కింద బిగబట్టి.. కుడి చేతి పిడికిలి బిగించి వెనకాలే పరుగెత్తుకుంటూ వచ్చాడు బుచ్చిమల్లు మనుమడు వంశీకృష్ణ.

పిల్లలకు ఎప్పుడు చెబుదామా అని ఉవ్విళ్ళూరుతున్న బుచ్చిమల్లుకు అనుకోకుండా మనుమడు మనుమరాలు రావడం పెదాలు విచ్చుకున్నాయి.

# విజయకేతనం

ప్రభుత్వ ఉద్యోగమన్నాక బదిలీలు తప్పవు. ఆపరంపరలో నేను రామచంద్రాపురం జూనియర్ కాలేజీలో జాయినయ్యాను.

నేనేకాలేజీకి వెళ్ళినా.. ప్రిన్సిపాళ్లు నాకు పరీక్షల విభాగం అదనపు బాధ్యతలు అంటగట్టడం ఆనవాయితీ. ఆవిభాగమంటే నాకూ మక్కువే. కాలేజీకది గుండెకాయ లాంటిది. దాని గుప్పిట్లోనే విద్యార్థులు.. లెక్చర్లూను. దాని అజమాయిషీ అంటే కత్తిమీద సాములాంటిది. అనుభవాల దొంతరలలో నాకలవాటై పోయింది.

నా విజ్ఞప్తి మేరకు అత్యవసర మీటింగ్ పెట్టాడు ప్రిన్సిపాల్ రామనాథం.

"మై డియర్ స్టాఫ్ మెంబర్స్.. మన కాలేజీ ఫలితాలను మెరుగు పరచడానికి తీసుకోవాల్సిన సోపానాలను చర్చించుకుందామని ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసాను. ముందుగా మన పరీక్షల విభాగపు ఇంచార్జ్ సూర్యప్రకాష్ తన సూచనలిస్తాడు" అంటూ రామనాథం నావంక చూసారు..

నాకు ఉత్సాహమొచ్చింది.

"డియర్ ఫ్రెండ్స్.. గుడ్ ఈవినింగ్.." అంటూ ఒక సారి స్టాఫ్‌ను కలియ జూశాను. జువాలజీ లెక్చరర్ ఫణీంద్ర, హిందీ లెక్చరర్ హిమజ గుస, గుస లాడుతున్నారు. ఇంగ్లీష్ లెక్చరర్ ఇంద్రాణి ఆసక్తిగా వింటోంది. మిగతా స్టాఫ్ తమకేమీ పట్టనంటూ దిక్కులు చూస్తున్నారు. లోలోన నవ్వుకున్నాను.

"నా మీద నమ్మకంతో కాలేజీ విభాగపు ఇంచార్జ్ అప్పగించిన ప్రిన్సిపాల్ గారికి ధన్యవాదాలు తెలుపు కుంటున్నాను. కాలేజీ ఫలితాల్లో కొంత మార్పు రావాలనే వారి ఆకాంక్ష. దాన్ని పూర్తి చేయడం మన కర్తవ్యం.. ఆ కోణంలో ఆలోచించి ఒక ముఖ్యమైన సూచన ఇవ్వదలిచాను..

మన కాలేజీ ఫలితాలను స్టడీ చేసాను.

పాఠాలు చెప్పడంలో.. సకాలంలో సిలబస్ పూర్తి చేయడంలో స్టాఫ్ లోపమేమీ లేకున్నా పిల్లలు పరీక్షలపై అవగాహన లేక విఫలమౌతున్నట్లు తోస్తోంది...

ఆటలకైనా.. పాటలకైనా.. ప్రాక్టీసు అవసరం. లేకుంటే అనుభవ రాహిత్యం వల్ల పరాభవం తప్పదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Jeevana+Gatulu**

* * *